ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 3

పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
మంగళవారం 17 జూన్ 2025



కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించండి

సాలూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సాలూరు పరిసర గ్రామాల్లో కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించి వారికి అవగాహన కల్పించాలని డిప్యూటీ పారా మెడికల్ అధికారి వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక ఫిలడెల్ఫియా లెప్రసీ ఆసుపత్రిలో సోమవారం ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో మళ్లీ లెప్రసీ రోగుల సంఖ్య పెరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో ఉండే ఆశా వర్కర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆ లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తించి.. వెంటనే ఆసుపత్రికి తీసుకురావాలని కోరారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సుర్జిత్‌పాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నీళ్లు రావట్లే.. దాహం తీరట్లే!



- జిల్లా కేంద్రంలో తీవ్రమైన తాగునీటి కష్టాలు
- గత ఎనిమిది రోజులుగా సమ్మెలో తాగునీటి సరఫరా విభాగం కార్మికులు
- నిలిచిన సరఫరా.. బిందెడు నీటి కోసం అవస్థలు
- ఎవరికీ పట్టని ప్ర'జల' ఇక్కట్లు
- అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై మున్సిపల్ వాసుల మండిపాటు

పార్వతీపురం టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం గొంతెండుతోంది.. తాగునీటి సమస్య తీవ్రమైంది. తాగునీటి సరఫరా కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో గత ఎనిమిది రోజులుగా మున్సిపాల్టీ వాసులు నానా అవస్థలు పడుతున్నారు. పురపాలక సంఘం అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రజలు బిందెడు నీటి కోసం అల్లాడిపోతున్నారు. వార్డులు, శివారు ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారు. రెండు, మూడు రోజుల కిందట వరకు ఏదోలా తాగునీటి సరఫరా చేసిన ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఇప్పుడు చేతులెత్తేశారు. తోటపల్లి ప్రధాన పంప్ వద్ద నైపుణ్యం కలిగిన కార్మికులు లేరు. నీటిని తోడే మోటార్లు మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో 30 వార్డులకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ప్రస్తుతం ప్రజలు ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

పార్వతీపురం మున్సిపాల్టీ ఏర్పడి సుమారు 60 ఏళ్లు దాటిపోయింది. గరుగుబిల్లి మండలం తోటపల్లి సమీపంలోని నాగావళి నది నుంచి పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా అయ్యేలా సుమారు 50 ఏళ్ల కిందటే పనులు చేపట్టారు. అయితే 2002లో పార్వతీపురం మున్సిపాల్టీ గ్రేడ్ -1 గా రూపాంతరం చెందింది. మూడేళ్ల కిందట జిల్లా కేంద్రంగా ఆవిర్భవించినా.. తాగునీటి సరఫరా గాడిన పడ లేదు. వేసవిలోనే కాదు అన్ని కాలాల్లోనూ ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బిందెడు నీటి కోసం పరుగులు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది.



సమ్మె చేస్తున్న మున్సిపల్ తాగునీటి సరఫరా విభాగం కార్మికులు

2019 తర్వాత మారిన సీన్..

పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు 2018లో రూ.33.33 కోట్లతో బృహత్తర తాగునీటి సరఫరా పథకానికి అడుగులు పడ్డాయి. అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో గరుగుబిల్లి మండలం గొర్లి సీతారాంపురం వద్ద తాగునీటి సరఫరా పథకానికి స్థల సేకరణ కూడా పూర్తిచేశారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని నిలిపేసింది. 2020లో రూ.66.60 కోట్లతో తాగునీటి పథకానికి నాటి వైసీపీ పాలకులు శిలాఫలకం ఆవిష్కరించినా పనులు మాత్రం పూర్తిచేయించలేక పోయారు.

జనాభాకు తగ్గట్టుగా సరఫరా ఏదీ..?

2012 గణాంకాల ప్రకారం పార్వతీపురం మున్సిపాల్టీ జనాభా 55వేల మంది. ప్రస్తుతం 30 వార్డుల్లో అనధికారికంగా చూసుకుంటే 80 వేలమందికి మించి ఉంటారు. అయితే తాగునీటి కార్మికుల సమ్మె వల్ల సరఫరా పూర్తిగా స్తంభించింది. దీంతో పట్టణంలో దాహం కేకలు తీవ్రమయ్యాయి. మున్సిపాల్టీ వాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. శివారు ప్రాంతవాసులైతే గత వారం రోజులుగా తాగునీటికి కటకటలాడుతున్నారు. ట్యాంకర్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. వాస్తవంగా పట్టణవాసులకు రోజుకు కనీసం 5 లక్షల లీటర్ల (మిగతా 6వ పేజీలో...)



మూడో వార్డు పరిధిలో ట్యాంకర్ చుట్టూ చేరిన ప్రజలు

బాబోయ్ జ్వరాలు

- వాతావరణ మార్పులతో ఆరోగ్య సమస్యలు
- పెరుగుతున్న వైరల్ జ్వరబాధితుల సంఖ్య
- కిక్కిరిసిన సీతంపేట ఏరియా ఆసుపత్రి

సీతంపేట రూరల్, జూన్16(ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలో జ్వరాలు పంజా విసురుతున్నాయి. గడిచిన కొద్ది రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకో వడంతో ప్రజలు ఆరోగ్య సమస్యలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రధానంగా వైరల్ జ్వరాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీలో మలేరియా తగ్గుముఖం పట్టినప్పటికీ విష జ్వరాలు మాత్రం గిరిజనులను పట్టి పీడిస్తున్నాయి. జ్వరం, తలనొప్పి, ఒళ్లనొప్పులు, కాళ్ల పీకులు వంటి లక్షణాలతో బాధపడుతున్నారు. కొందరు గ్రామాలకే పరిమితమవగా.. మరికొందరు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు.జ్వరపీడితులతో సోమవారం ఏరియా ఆసుపత్రి కిక్కిరిసింది. 349 వరకు ఓపీ రాగా వారిలో 91 మంది వైరల్ జ్వరాలతో, 23 మంది మలేరియాతో బాధపడుతున్నట్లు రక్తపరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. 39 మంది జ్వరాలతో ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లుగా చేరినట్లు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డీవీ శ్రీనివాసరావు తెలిపారు.



రక్తపరీక్షల కోసం వేచి ఉన్న జ్వరపీడితులు

స్కూల్ బ్యాగు తగ్గింది బరువు

- పుస్తకాల సంఖ్య కుదింపు
- ముద్రణలో పలు మార్పులు
- నాణ్యమైన విద్యకు సెమిస్టర్ విధానం

సాలూరురూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల స్కూల్ బ్యాగు బరువు తగ్గింది. మోత బాధ తప్పింది. గతంలో బ్యాగు నిండా పుస్తకాలు ఉండేవి. దీంతో బ్యాగును మోసుకుంటూ పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించడంతో పాటు విద్యార్థులు సులభంగా పాఠ్యాంశాలు అర్థం చేసుకోవడానికి సెమిస్టర్ విధానం ప్రవేశపెట్టింది. బోధనా కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ఇందులో భాగంగా పుస్తకాల సంఖ్యను కుదించి విద్యార్థులకు బ్యాగు బరువు తగ్గించింది. పుస్తకాల ముద్రణలో కూడా పలు మార్పులు చేసింది. ఆకర్షణీయంగా, బరువు తక్కువగా ఉండేలా రూపొందించారు. ఏడాదికి రెండు సెమిస్టర్లగా పుస్తకాలను తయారు చేశారు. గతంలో 1,2 తరగతులకు తెలుగు, ఇంగ్లీషు, గణిత పాఠ్య పుస్తకాలు వేర్వేరుగా ఉండేవి. వర్క్‌బుక్‌లు సైతం వేర్వేరుగా ఉండేవి. దీంతో 1,2 తరగతుల విద్యార్థులు మొత్తం ఆరు పుస్తకాలు మోయాల్సి వచ్చేది. ప్రస్తుతం 1,2 తరగతులకు సెమిస్టర్‌కు రెండేసి పుస్తకాలు మాత్రమే ఉండేటట్టు తయారు చేసి అందించారు. తెలుగు, ఆంగ్లం, గణితం కలిపి ఒకే పాఠ్యపుస్తంగా, ఇదే విధంగా మూడు కలిపి ఒకే వర్క్‌బుక్‌గా అందించారు. దీంతో విద్యార్థులు కేవలం రెండు పుస్తకాలు తీసుకుని వస్తున్నారు. 3 నుంచి 5వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లీష్ కలిపి ఒక పుస్తకంగా, పరిసరాల విజ్ఞానం కలిపి ఒక పుస్తకంగా రూపొందించారు. 6 నుంచి 9వ తరగతికి సంబంధించి తెలుగు, హిందీ, ఇంగ్లీష్ కలిపి ఒక పుస్తకంగా తయారు చేశారు. జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం కలిపి ఒక పుస్తకంగా, భౌగోళిక, చరిత్ర, ఆర్థిక, పౌర శాస్త్రాలు కలిపి ఒక పుస్తకంగా అందించారు. పదో తరగతికి సెమిస్టర్ విధానంలో అందిస్తున్నారు. దీంతో విద్యార్థుల బ్యాగ్ బరువు తగ్గింది. పార్వతీపురం మన్యం జిల్లాలో 1,503 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 90వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్‌ల ద్వారా 4,87,214 నోట్ పుస్తకాలు, 4,22,333 పాఠ్యపుస్తకాలు, 61,814 వర్క్‌బుక్‌లు, 89 వేల బ్యాగ్‌లు, 64 వేల బెల్ట్‌లు, బూట్లు అందించారు. యూనిఫాం ఇంకా రావాల్సి ఉంది. బ్యాగ్ బరువు తగ్గడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఒకటి నుంచి ఐదు తరగతులకు ఇచ్చిన పుస్తకాలు



చేయి చేయి కలిపారు..

రోడ్డును సరిచేశారు

సీతంపేట రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గిరిశిఖర గ్రామాలైన మొగదార-రుక్మిణిగూడ మట్టి రహదారిపై వేసిన సబ్ గ్రేడెడ్(జీఎస్‌బీ)మెటల్ ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో గుంతలు ఆ మార్గంలో ఏర్పడ్డాయి. ఆయా గ్రామస్థులు దిగువ ప్రాంతానికి వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చేసేది లేక ఆయా గ్రామాల యువకులు సోమవారం చేయిచేయి కలిపారు. శ్రమదానంతో రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఉపాధి నిధులు రూ.3.50కోట్లతో ఇటీవల ఆ రహదారి పనులు ఇటీవల చేపట్టారు. రహదారి పొడవునా మట్టిపనులు, అక్కడక్కడా కల్వర్ట్ నిర్మాణాలు పూర్తిచేశారు. దారిపొడవునా జీఎస్‌బీ మెటల్‌ను పరిచి సంబంధిత కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. దీనిపై సంబంధిత ఏఈ ఎస్.భాస్కరరావును వివరణ కోరగా వర్షం కారణంగా జీఎస్‌బీ కొట్టుకుపోవడం వాస్తవమేనని తెలిపారు. మరో వారం రోజుల్లో సీసీ రహదారి నిర్మాణం ప్రారంభిస్తామని చెప్పారు.



శ్రమదానంతో రోడ్డు చదును చేస్తున్న గిరిజన యువకులు



సీతంపేటలో ఓ బ్యాంకు వద్ద గిరిజనులు ఇలా..

బ్యాంకుల వద్ద సందడి

- 'తల్లికి వందనం' నిధులు డ్రా చేసేందుకు తరలివచ్చిన ఖాతాదారులు 4లో

తాబేళ్లవలసలో గజరాజులు

కలెక్టరేట్ వద్ద నిరసనల హోరు 6లో

- వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన

యోగాంధ్ర ఏర్పాట్ల పరిశీలన

- నేడు ఏనుగులకొండ వద్ద నిర్వహణ
- అధికారులకు సూచనలిచ్చిన కలెక్టర్

పార్వతీపురం/మక్కువ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మక్కువ మండలం వెంగళరాయసాగర్ (వీఆర్ఎస్) సమీపంలోని ఏనుగులకొండ వద్ద మంగళవారం పెద్దఎత్తున యోగాంధ్ర నిర్వహించ నున్నారు. ఈ మేరకు ఆ ప్రాంతంలో అధికారులు చేస్తున్న ఏర్పాట్లను సోమవారం కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పరిశీలించి పలు సూచనలు చేశారు. పర్యాటక ప్రాంతాల్లో భారీగా యోగాంధ్ర నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే తోటపల్లి, సీతంపేట ప్రాంతాల్లో నిర్వహించామని తెలిపారు. ఏనుగులకొండ వద్ద నిర్వహించే కార్యక్రమం కోసం మాస్టర్ ట్రైనీల శిక్షణ పూర్తయిందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములై యోగాంధ్రను జయప్రదం చేయాలని కోరారు. గ్రామస్థాయి నుంచి యోగా పోటీలు ప్రారంభమయ్యాయన్నారు. ఆయన వెంట డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఇతర అధికారులు ఉన్నారు. ● జిల్లాలో సామాన్యుల వరకు యోగాను తీసుకెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. అన్ని వర్గాల వారిని ఇందులో భాగస్వాములవ్వాలని తెలిపారు. సూర్యఘర్ యూనిట్ల రిజిస్ట్రేషన్, గ్రౌండింగ్ సమాంతరంగా జరగాలన్నారు. పీఎం జన్‌మన్ గృహాల నిర్మాణం మరింత వేగవంతం కావాలన్నారు.



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

'ఉత్కర్ష్ అభియాన్'కు అనూహ్య స్పందన

సాలూరు: ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డీఏజేజీయూఏ) కార్యక్రమానికి గిరిజనుల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. సోమవారం సాలూరు (మిగతా 6వ పేజీలో...)

రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీల్లో జిల్లాకు బహుమతులు

సాలూరు రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీల్లో జిల్లాకు రెండు బహుమతులు వచ్చినట్టు గిరిజన సంక్షేమశాఖ డీడీ ఆర్.కృష్ణవేణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఈ పోటీలకు జిల్లా నుంచి 49 మంది వెళ్లారు. తొలిరోజు పోటీల్లో స్కిట్ విభాగంలో 18 వరకు బృందాలు పాల్గొన్నాయి. జిల్లాకు చెందిన ఎనిమిది మంది బృందం తృతీయ బహుమతిని కైవసం చేసుకుంది. వాల్‌పేపర్ పెయిటింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థి తృతీయ బహుమతిని సాధించింది. యోగాంధ్రలో పాటలు, యోగాసనాలు తదితర పోటీలు మంగళవారం సైతం జరగనున్నాయి.' అని ఆమె తెలిపారు.

ఊపిరి తీసిన గుంత

- ఇటుకల తయారీ మట్టి కోసం తవ్విన గుంతలో పడి ఇద్దరి విద్యార్థినుల మృతి
- చేపలు పట్టేందుకు దిగి.. తిరిగిరాని లోకాలకు..
- శోక సంద్రంలో బొడ్డమానుగూడ





మృతి చెందిన జెస్సిక , సునంద మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లి

కురుపాం రూరల్, జూన్ 16, (ఆంధ్రజ్యోతి): కురుపాం మండలం బొడ్డమానుగూడలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఇటుకల తయారీ మట్టి కోసం తవ్విన గుంతలో పడి ఇద్దరి గిరిజన విద్యార్థినులు మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

బొడ్డమానుగూడకు చెందిన మండంగి జెస్సిక(12), బిడ్డిక సునంద(10)లు లంకాజోడు గిరిజన సంక్షేమ ఆశ్రమ స్కూల్లో చదువుతున్నారు. పాఠశాల పునఃప్రారంభమైనా వారింకా వెళ్లలేదు. అయితే రోజూలానే వారు సోమవారం కూడా కలిసి ఆడుకున్నారు. చేపలు పట్టేందుకని గ్రామానికి సమీపంలో ఉన్న ఇటుకల తయారీ మట్టి కోసం తవ్విన గుంతలోకి దిగారు. అందులోని బురదలో చిక్కుకుని ఊపిరాడక తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అచేతనంగా పడి ఉన్న విద్యార్థినులను బయటకు తీసి మొండెంఖల్ పీహెచ్‌సీకి తరలించారు. అయితే అప్పటికే బాలికలు మరణించినట్టు అక్కడి వైద్యురాలు ప్రజ్ఞ తెలిపారు. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు, బంధువులు భోరున విలపించారు. అంతవరకు సరదాగా కలిసి ఆడుకున్న వారు (మిగతా 6వ పేజీలో...)

బదిలీ స్థానాలకు గురువులు

సాలూరు రూరల్, జూన్ 16 (ఆంధ్ర జ్యోతి): బదిలీలు పొందిన ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. ఉమ్మడి జిల్లాలో అన్ని క్యాడర్లు కలిసి 3,690 మందికి స్థాన చలనమైన విషయం తెలిసిందే. వారిలో 2,176 మంది తాము కోరుకున్న పాఠశాలల్లో ఈ నెల 12 నుంచి విధులు నిర్వహిస్తున్నారు. 1514 మంది టీచర్లు సోమవారం కొత్త స్థానాల్లోని పాఠశాలల్లో చేరారు. తొలుత ఎంఈవో కార్యాలయాలకు వెళ్లి రిలీవింగ్ ఆర్డర్లు ఇచ్చి జాయినింగ్ ఆర్డర్లు పొందారు. ఉపాధ్యాయులకు తమ పాత పాఠశాలల్లో విద్యార్థులు, మిగతా సిబ్బంది వీడ్కోలు పలికారు. కొత్త పాఠశాలల్లో అక్కడి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు.



కందిరివలస నుంచి పాంచాలికి బదిలీపై వెళ్తున్న టీచర్‌కు వీడ్కోలు చెబుతున్న విద్యార్థులు

మండలాల వారీగా బదిలీలు ఇలా...

సాలూరు	150	డెంకాడ	103
బలిజిపేట	87	గజపతినగరం	108
సీతానగరం	66	గంట్యాడ	84
గుమ్మలక్ష్మీపురం	103	గరివిడి	141
గరుగుబిల్లి	77	గుర్ల	156
జియ్యమ్మవలస	65	జామి	76
కొమరాడ	99	కొత్తవలస	71
కురుపాం	63	మెంటాడ	82
పాచిపెంట	109	నెల్లిమర్ల	138
మక్కువ	81	మెరకముడిదాం	93
పార్వతీపురం	179	పూసపాటిరేగ	161
బాడంగి	74	రామభద్రపురం	93
బొండపల్లి	100	తెర్లాం	86
భోగాపురం	121	విజయనగరం	385
చీపురుపల్లి	99	లక్కవరపుకోట	78
బొబ్బిలి	143	శృంగవరపుకోట	91
దత్తిరాజేరు	82	వేపాడ	46

ప్రోత్సహిస్తూ.. అవగాహన కల్పిస్తూ..

- వంట నూనెల దిగుమతుల తగ్గింపునకు ప్రయత్నాలు
- జిల్లాలో పామాయిల్ తోటల పెంపకంపై అవగాహన



రొంపల్లి వద్ద పామాయిల్ తోటలో అంతర్ పంట సాగు

బొబ్బిలి, జూన్ 16(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో పామాయిల్ తోటల పెంపకానికి ప్రభుత్వం రాయితీలు అందజేస్తోంది. తోటల సాగు వల్ల లాభాలను వివరిస్తూ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా వంట నూనెల దిగుమతి ఎక్కువగా జరుగుతోంది. గత మూడు దశాబ్దాలుగా వంట నూనెల సాగును పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఈ నేపథ్యంలో క్రూడాయిల్ తర్వాత వంట నూనెలకే విదేశీ మారక నిల్వలను ఎక్కువగా వినియోగించాల్సి వస్తోంది. దీంతో ఎలాగైనా దేశీయంగా వంట నూనెల ఉత్పత్తిపెంచి స్వావలంబన సాధించి దిగుమతులు తగ్గింపునకు ప్రయత్నాలు ప్రారంభించారు. దీని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించి, ప్రోత్సహకాలు ప్రకటిస్తున్నాయి.

మార్కెటింగ్ సదుపాయం..

రాష్ట్రయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేబీఐ), సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం (ఎంఐడీహెచ్) కింద రైతులకు ఉద్యాన పంటల సాగు కోసం పలు రకాల ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందజేస్తోంది. అలాగే మార్కెటింగ్ సదుపాయాలు కూడా కల్పిస్తోంది. దీంతో ఒకప్పుడు సాగుచేయడానికి ముందుకురాని రైతులు సైతం ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జిల్లాలో 1848 హెక్టార్లలో ఆయిల్‌పామ్ తోటలు సాగుచేస్తున్నట్లు జిల్లా ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టరు చంద్రశేఖర్ తెలిపారు. 2025-26 సంవత్సరంలో జిల్లాలో 1850 హెక్టార్లలో ఆయిల్‌పామ్ తోటలను పెంచేందుకు రైతులను ప్రోత్సహిస్తూ వారికి అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

ప్రధానంగా బొబ్బిలి డివిజన్‌లో ప్రస్తుతం పామాయిల్ తోటలను రైతులు ఎక్కువగా చేస్తున్నారు. ఒక్క బొబ్బిలి మండలంలో 1789 హెక్టార్ల విస్తీర్ణంలో పామాయిట్ తోటలు ఉండడం విశేషం. దీనికి అదనంగా ఈ ఏడాది మరో 200 హెక్టార్లలో (500 ఎకరాలు) బొబ్బిలి మండలంలో పామాయిల్ తోటలు వేసేందుకు రైతులను ప్రోత్సహిస్తూ వారికి అవగాహన కల్పిస్తున్నారు. రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాలకు 220 హెక్టార్లలో ఈ ఏడాది పామాయిల్‌తోటలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

నీటి వనరులు ఉన్న చోట..

ఉద్యానవనశాఖ ద్వారా ఈ ఏడాది పామాయిల్ తోటల పెంపకానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించినే పథకాల ద్వారా రైతులకు ప్రోత్సాహకాలు ప్రకటించడంతో జిల్లాలో రైతులకు అధికారులు సాగుపై అవగాహన కల్పిస్తున్నారు. నీటి వనరులు కలిగి ఉన్న రైతులకు పామాయిల్ తోటలు, అందులో అంతర పంటలు సాగు లాభదాయకంగా ఉంటుందని అధికారులు వివరిస్తున్నారు. బొబ్బిలి మండలంలో ఉద్యాన రైతులకు ఉద్యానవనశాఖాధికారి వెంకటరత్నం, బాడంగి, రామభద్రపురం, తెర్లాం మండలాలకు హెచ్‌వో మోహనకృష్ణ సాగుపై రాయితీల గురించి తెలియజేస్తున్నారు.

తోటల్లో అంతర పంటలు..

● హెక్టారుకు 143 పామాయిల్ మొక్కలు వేయాల్సి ఉంటుంది. ● విదేశీ రకం మొక్క ఒక్కొక్కటి 193 రూపాయలు, దేశవాళీ మొక్క రూ.133 చొప్పున ధర నిర్ణయించారు. ● ఇందుకోసం హెక్టారుకు విదేశీ మొక్కలైతే రూ.29 వేలు, దేశవాళీ అయితే రూ.21 వేలు చొప్పున రాయితీలను అందజేస్తారు. ● వీటితో పాటు ఏడాదికి 5,250 రూ పాయల చొప్పున వరుసగా నాలుగేళ్ల వరకు ఆర్థిక సహాయం రైతులకు అందుతుంది. ● పామాయిల్ పంట చేతికొచ్చేసరికి నాలుగేళ్లు పడు తుండడంతో ఈలోగా తోటల్లో అంతర పంటలను వేసేందుకు ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. ● కూరగాయల మొక్కలు లేదా పప్పుధాన్యాలు, మొక్కజొన్న వంటి పంటలు వేసుకునేందుకు రైతులకు హెక్టారుకు రూ.5250 రూపాయల చొప్పున వరుసగా నాలుగేళ్ల పాటు ప్రభుత్వం సాగుకు ప్రోత్సాహకాలను అందజేస్తుంది. ● అంతర పంట లుగా డ్రాగన్ ఫ్రూట్, టిష్యూకల్చర్ అరటి, బొప్పాయి, సీతాఫలం, రేగు, జామ, జీడిమామిడి, కోకో సంకరజాతి ఉల్లి, కూరగాయలు, శాశ్వత పందిళ్లు, విడి పువ్వుల మొక్కలు, కట్ ఫ్లవర్స్ పెంపకానికి ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. ● పామాయిల్ తోటల సాగుకు డ్రిప్ ఇరిగేషన్ కోసం ఐదెకరాల లోపు రైతుకు 90 శాతం సబ్సిడీ, ఐదెకరాల పైబడ్డ ఉన్నరైతులకు 60 శాతం చొప్పున సబ్సిడీని అందజేస్తారు.

పామాయిల్ సాగు వివరాలు..

మండలం	హెక్టార్లు
బొబ్బిలి	401.16
రామభద్రపురం	318.86
ఎస్.కోట	234.1
బాడంగి	198
తెర్లాం	182.78
మెంటాడ	150



రామభద్రపురం మండలంలోని మామిడిపల్లి పామాయిల్ తోటను పరిశీలిస్తున్న అధికారులు

ఆయిల్ పామ్ రైతులకు రాయితీలు..



కొబ్బరి అభివృద్ధి బోర్డు పథకం పథకంలో రైతులకు హెక్టారుకు రూ.6500 చొప్పున ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. ఏపీ ఫుడ్ ప్రొసెసింగ్ సొసైటీ ద్వారా చిన్న తరహా ఆహారపరిశ్రమలను పెట్టుకునే లబ్ధిదారులకు 35 శాతం రాయితీ అందిస్తోంది. నేషనల్ మిషన్ ఆన్ ఈడబుల్ ఆయిల్స్ (ఎన్‌ఎంఈఓ) పథకం ఈ ఏడాది ఆయిల్ పామ్ రైతులకు రాయితీలు అందుతాయి. పామాయిల్‌తో పాటు ఉద్యాన వన పంటలకు మంచి ప్రోత్సాహకాలు ప్రభుత్వం అందజేస్తోంది.

-ఎస్.వెంకటరత్నం, ఉద్యానవనశాఖాధికారి, బొబ్బిలి

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

వేపాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వేపాడలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం పదో వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ధర్మకర్త రాపర్తి చిరంజీవి ప్రసాదు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అనకాపల్లికి చెందిన వేదపండితులు చక్రవర్తి బృందం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామికి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించింది. అన్న సమారాధన కార్యక్రమం కూడా ఏర్పాటుచేశారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు దంపతులు, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

కొరమలో ..

భామిని, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరమలోగల నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఎనిమిదో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు మంగళ స్నానాలు చేసి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అంగరంగ వైభవంగా శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మల్లిబాబు, చిట్టిబాబు, సత్యం, ధర్మకర్తలు అగతముడి గోవిందరావు, శ్రీనివాసరావు, లింగరాజు పాల్గొన్నారు.



వేపాడ: స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బ్యాంకుల వద్ద సందడి

- 'తల్లికి వందనం' నిధులు డ్రా చేసేందుకు తరలివచ్చిన ఖాతాదారులు



సాలూరు: ఖాతాదారులతో కిటకిటలాడున్న యూనియన్ బ్యాంకు

పార్వతీపురం మన్యం జిల్లాలోని పలు బ్యాంకులు సోమవారం ఉదయం పది గంటల నుంచే కిటకిట లాడాయి. విద్యార్థులకు సంబంధించి తల్లికి వందనం నిధులు టీడీపీ ప్రభుత్వం జమచేసిన విషయం విదితమే. ఆ నిధులు ఖాతాల్లో నుంచి పాఠశాలల్లో చేర్పించుకు అయ్యే తక్షణ ఖర్చుల కోసం డ్రాచేసేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బ్యాంకుల వద్దకు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది.

● సాలూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌బీఐతోపాటు పలు బ్యాంకులు విద్యార్థుల తల్లిదండ్రులతో కిటకిటలాడాయి. బ్యాంక్ ఖాతాలో పడిన డబ్బులు విత్‌డ్రా చేసేందుకు కొందరు, డబ్బులు జమ అయ్యాయో లేదోనన్న సమాచారం తెలుసుకునేందుకు గంటల తరబడి క్యూలో నిలబడ్డారు.

● మక్కువ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మక్కువలోని ఎస్‌బీఐ వినియోగదారుల సేవా కేంద్రంతోపాటు పలుబ్యాంకుల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు బారులు తీరారు. తల్లికి వందనం నిధులు విత్ డ్రా చేసేందుకు తెల్లవారే తరలివచ్చారు.

● గుమ్మలక్ష్మీపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గుమ్మ లక్ష్మీపురంలో సోమవారం పండుగ వాతావరణం నెలకొంది. తల్లికి వందనం నిధులు విద్యార్థుల తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలో పడడంతో వివిధ గ్రామాల నుంచి ప్రజలు బ్యాంకుల వద్దకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మండలంలో సుమారు 9,500 మంది విద్యార్థుల ఖాతాల్లో ఈ నిధులు జమయ్యాయి. ఏజెన్సీలోని గిరిజనులు తల్లికి వందనం డబ్బులతో నిత్యావసర సరుకులు, ఇతర వస్తువుల కొనుగోలుకు ఆసక్తి చూపారు. గుమ్మలక్ష్మీపురం, భద్రగిరిలోని షాపులు దుకాణాలు కిటకిటలాడాయి.

● సీతంపేట రూరల్,జూన్ 16(ఆంధ్రజ్యోతి): సీతంపేటలోని యూనియన్, స్టేట్‌బ్యాంక్‌ల వద్ద తల్లికి వందనం పథకం డబ్బుల కోసం గిరిజన మహిళలు పడిగాపులు కాశారు. తల్లికి వందనం పథకం లబ్ధిదారులు ఒక్కసారిగా బ్యాంకులకు పోటెత్తడంతో నగదు కొరత తలెత్తింది. దీంతో సిబ్బంది నగదు తీసుకువచ్చేంత వరకు బ్యాంక్‌ల ఆవరణలో బారులు తీరారు.

తాబేళ్లవలసలో గజరాజులు

సీతంపేట రూరల్,జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని చినబగ్గ పంచాయతీ పరిధిలోని జరడకాలనీ, తాబేళ్లవలస సమీపంలోని జీడితోటల్లో గజరాజులు తిష్ఠవేశాయి. ఇక్కడ కొద్దిరోజులు ఏనుగుల సంచారం లేకపోవడం తో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. భామిని మండలంలో కొంత కాలంగా సంచరిస్తున్న గజరాజుల గుంపు సోమవారం సీతంపేట ఏజెన్సీలోకి ప్రవేశించాయి. వేకువజాము ప్రాంతంలో గజరాజులు ఘీంకారాలు వినిపించాయని, భయంతో తెల్లవారే వరకు భిక్కు భిక్కు మంటు ఉన్నామని తాబేళ్లవలస గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుతం ఖరీఫ్ పనులు ప్రారంభం కావడంతో తోటలు, పొలాల్లో ఏనుగులు తిష్ఠ వేయడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తక్షణమే ఏను గులను ఈ ప్రాంతం నుంచి తరలించి తమకు న్యాయం చేయాలని గిరిజనులు కోరారు.



అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న ప్రణాళికా సిబ్బంది

ఇందిరానగర్‌లో ఆక్రమణల తొలగింపు

విజయనగరం రింగురోడ్డు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని ఇందిరానగర్‌లో ఆక్రమించి అక్రమంగా చేపట్టిన నిర్మాణాలు గుర్తించి ప్రణాళిక సిబ్బంది సోమవారం కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశాలతో తొలగించారు. ఇక్కడ తాత్కాలిక నిర్మాణాలు చేపట్టి చిరు వ్యాపారస్థులను తరలించారు. ఈ సందర్భంగా నల్లనయ్య మాట్లాడుతూ ఖాళీ స్థలాలు, రహదారులు ఆక్రమించి ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు నగర క్రమబద్ధీకరణ చర్యల్లో భాగంగా అక్రమ నిర్మాణాలు, అనధికార కట్టడాలను ఉపేక్షించబోమని హెచ్చరించారు.

హక్కులపై అవగాహన అవసరం

- న్యాయాధికారి విజయ్‌రాజ్‌కుమార్



గజపతినగరం: మాట్లాడుతున్న విజయ్‌రాజ్‌కుమార్

గజపతినగరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ హక్కులపై అవగాహన అవసరమని న్యాయాధికారి ఎ.విజయ్ రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం గజపతినగరం కోర్టు ఆవరణలో హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుల విషయంలో ఇరు పార్టీలు సమయస్ఫూర్తితో వ్యవహరించి లావాదేవీలు జరుపుకోవాలన్నారు. చిన్న పాటి సమస్యలకు కోర్టుల చుట్టూ తిరగకుండా గ్రామపెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలని సూచించారు.

క్రమశిక్షణతో అభ్యసించాలి

మెంటాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే చక్కటి భవిష్యత్తు ఉంటుందని గజపతినగరం సివిల్ కోర్టు న్యాయాధికారి విజయ్‌రాజ్‌కుమార్ తెలిపారు. ఆంధ్ర గిరిజన ఆశ్రమ పాఠశాలలో వసతులను పరిశీలించి, విద్యార్థుల సమస్యలను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాది కె.సాయి శేఖర్,కోర్టు సిబ్బంది ఆదిలక్ష్మి, ఆర్.నాగమణి, బి.ప్రసన్నలక్ష్మి, వార్డెన్ పి.అప్పారావు, ఉపాధ్యాయులు జి.శివ,ఎస్.మనోరంజని, వై .జోగయ్య పాల్గొన్నారు.



లఖనాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు

- సీతానగరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పద్మావతి

గరుగుబిల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని సీతానగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి తెలిపారు. సోమవారం మండలంలోని లఖనాపురంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో సారా ప్రభావమున్న గ్రామాలను గుర్తించి సారాకు దూరంగా ఉండేలా దృష్టి సారిస్తున్నామని తెలిపారు. మండలంలోని ఉల్లిభద్ర, కొంకడివరం, సన్యాసిరాజుపేట గ్రామాలను సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. లఖనాపురం గ్రామాన్ని గుర్తించినట్లు చెప్పారు. అనధికారికంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు శశికుమార్, తిరుపతిరావు, సబ్‌ఇన్‌స్పెక్టర్ షరీఫ్, ఎఫ్‌బీవో రమేష్ పాల్గొన్నారు.

పర్యవేక్షణ లేక.. చెత్త తొలగించక

- గాడితప్పిన పారిశుధ్య నిర్వహణ
- ఇదీ రాజాం మునిసిపాలిటీలో పరిస్థితి

రాజాం రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి):

రాజాం మునిసిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ గాడితప్పింది. ప్రధానంగా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో చెత్తను రోజుల తరబడి తొలగించడంలేదు. ఈ నేపథ్యంలో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు వీధుల్లో చెత్త నిల్వలు పేరుకుపోతున్నాయి. కాలువలు వ్యర్థాలతో నిండిపోతున్నాయి. దీంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నా రాజాం మునిసిపాలిటీలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో రోడ్డుపై అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొంది. పట్టణంలోని అనేక వీధులు దుర్గంధభరితంగా తయారయ్యాయి. ఏమాత్రం చిరుజల్లులు కురిసినా కాలువల్లోని మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. చెత్త సేకరణ పాయింట్ల వద్ద రోజుల తరబడి నిల్వలు పేరుకుపోతున్నాయి. పట్టణంలోని నాలుగు ప్రధాన మార్గాలలో వ్యర్థాలను తొలగించి... చేతులు దులుపుకొంటున్నారు. వీధి కాలువల వైపు కన్నెత్తి చూడడం లేదు. గొల్లవీధి, చాకలివీధి, రెల్లివీధి, మల్లికార్జున కాలనీ, మెంటిపేట ఎస్సీ కాలనీ తదితర ప్రాంతాల్లో చెత్తకుప్ప లుగా పేరుకుపోతోంది. వీటిని తొలగించేందుకు మునిసిపల్ సిబ్బంది చర్యలు తీసుకోవ డంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సిబ్బంది లేకపోవడంతో పారిశుధ్య నిర్వహణపై ప్రభావం పడుతోంది.



కొరగంజి వీధిలో మురుగునీరు



పుచ్చలవీధిలో కాలువలో పేరుకుపోయిన చెత్త

భోగాపురానికి బస్సులేవీ?

● ఎక్స్‌ప్రెస్‌లు సైతం నిలవని దుస్థితి
● 24 పంచాయతీల్లో నాలుగింటికే పల్లె వెలుగు సౌకర్యం
● ఆటోల్లో రాకపోకలతో స్థానికుల అగచాట్లు



భోగాపురం, జూన్16 (ఆంధ్రజ్యోతి): భోగాపురం అనగానే అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం జరుగుతోంది అని గొప్పగా చెబుతున్నారే గానీ ఈ ప్రాంతంలో కనీసం పల్లె వెలుగు బస్సులు తిరగడంలేదని ఎవరూ గుర్తించడంలేదు. దీంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలం మీదుగా జాతీయ రహదారి ఉన్నప్పటికీ ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలిపే పరిస్థితిలేదు. దాంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. పల్లెవెలుగు బస్సులు మండలంలోని గ్రామాల్లోకి వెళ్లడంలేదు. మండలంలో 22 పంచాయతీలు ఉంటే కేవలం నాలుగు పంచాయతీలకు మాత్రమే పల్లె వెలుగు బస్సు సౌకర్యం ఉంది. దాంతో 18 పంచాయతీలకు చెందిన ప్రజలకు ఆటోలే దిక్కువుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించిన భోగాపురంలో ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలుపుదల చేయడంతో పాటు మండలంలోని అన్ని పంచాయతీలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేందుకు పాలకులు చర్యలు చేపట్టాల్సి ఉంది.



మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ఆటోలు

నేడు ప్రభుత్వ ఐటీఐలో ఉద్యోగ మేళా

విజయనగరం దాసన్నపేట, జూన్16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విటి.అగ్రహారంలో గల ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం ఉదయం 9 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.వి.గిరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదారబాద్‌కు చెందిన రానే మద్రాస్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. ఐటీఐ వెల్డర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్ ట్రేడుల్లో ఈ మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నెలకు రూ.12,300, ఎకామిడేషన్, క్యాంటీన్ సౌకర్యాలు అందిస్తారని వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలతో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు. వివరాలకు 81060 25022, 98499 44654 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

5న జాతీయ లోక్ అదాలత్

రాజాం రూరల్, జూన్16 (ఆంధ్రజ్యోతి): రాజాం సీనియర్, జూనియర్ జడ్జి కోర్టుల సముదాయంలో జులై 5న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ ఓ ప్రకటనలో తెలిపారు. అదాలత్‌లో రాజీకి అనుకూలమైన అన్ని సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జడ్జి సూచించారు. అదాలత్‌లో ఇచ్చిన తీర్పు అంతిమమని గుర్తించాలని న్యాయాధికారి స్పష్టం చేశారు.

రేపు యోగా పోటీలు

రాజాం, జూన్16 (ఆంధ్రజ్యోతి): వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఈనెల 18న ఉదయం యోగా పోటీలను నిర్వహిస్తామని యోగా గురువు టీటీ వీ రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు నాలుగు విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. మొదటి విభాగంలో 14 ఏళ్లలోపువారు, రెండో విభాగంలో 14 నుంచి 30 ఏళ్లలోపువారు ఉంటారన్నారు. మూడో విభాగంలో 31 నుంచి 50 సంవత్సరాల లోపు, నాలుగో విభాగంలో 51 నుంచి 70 ఏళ్లలోపు వారికి నిర్ణీత ఆసనాలపై మాత్రమే పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గలవారు యోగా గురువు రమణమూర్తి, పోటీల కన్వీనర్ గడే అప్పలనాయుడు, ముఖ్య సమన్వయకర్త వాకచర్ల పైడిరాజులను సంప్రదించవచ్చన్నారు.

ఐసీడీఎస్ పీవోగా రాజేశ్వరి

గజపతినగరం, జూన్16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిగా ఎం.రాజేశ్వరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చీపురుపల్లి నుంచి ఆమె ఇక్కడకు బదిలీపై వచ్చారు.

ఏపీపీగా గేదెల సత్యం

విజయనగరం క్రైం, జూన్16 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా విజయనగరానికి చెందిన న్యాయవాది గేదేల సత్యం నియమితులయ్యారు. డైరెక్టరు ఆఫ్ ప్రాసిక్యూషన్ జారీ చేసిన ఉత్తర్వులను ఫ్యామిలీ కోర్టు న్యాయాధికారి విజయకల్యాణికి సోమవారం ఆయన అందజేశారు. సత్యం 20 ఏళ్లుగా జిల్లా కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్నారు. బీఎస్ఎల్‌ఏ సభ్యుడిగా బాధితులకు అండగా నిలిచి పలు కేసులు వాదించారు. పేద ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందించారు. ఈ సందర్భంగా సత్యంను బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శృంగవరపుకోట, జూన్16 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట శ్రీనివాస కాలనీ, బర్మాకాలనీ, మండల పరిషత్ కార్యాలయం, కొత్తశాలిపేట, వైఎస్ఆర్ కాలనీ, దేవికూడలి, పుణ్యగిరి రోడ్డులో మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విజయనగరం రూరల్ ఈఈ సురేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. పుణ్యగిరి ఫీడర్‌లో నిర్వహణ పనుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

జనసేనలో చేరిన గంటా



గంటాకు కండువా వేస్తున్న ఎమ్మెల్యే

నెల్లిమర్ల, జూన్16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి గంటా సత్యనారాయణ తన అనుచరులతో సోమవారం జనసేన పార్టీలో చేరారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి, జిల్లా నాయకుడు లోకం ప్రసాద్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. జనసేనలో చేరిన వారిలో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా విభాగం అధ్యక్షుడు రాయల తారకేశ్వరరావు, మండల అధ్యక్షుడు పృథ్వీ, యూత్ అధ్యక్షుడు మధుసూధనరావు, ఆదపాక రాంబాబు, కృష్ణమోహన్, రవి తదితరులున్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజిని, రవికుమార్, నాని తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయండి

భోగాపురం, జూన్16 (ఆంధ్రజ్యోతి): పార్టీ అభివృద్ధికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జనసేన పార్టీ నాయకుడు పల్లంట్ల జగదీశ్ కోరారు. సోమవారం భోగాపురంలోని పార్టీ కార్యాలయంలో జన సైనికులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ జనసేన పార్టీ వార్డు స్థాయి నుంచి అభివృద్ధి చెందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది వరుపుల సుధాకర్ నాయకులు పల్ల రాంబాబు, పడాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



కనకమహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో యోగా సాధన

చీపురుపల్లి, జూన్16 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పొందవచ్చునని యోగా శిక్షకురాలు గవిడి సుజాత అన్నారు. యోగాంధ్రలో భాగంగా స్థానిక కనకమహలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద సోమవారం ఆమె భక్తులకు యోగాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగా చేయవచ్చునన్నారు. యోగా సాధన వల్ల రోగ నిరోధక శక్తి పెంచుకోవచ్చునని, మానసిక ఒత్తిడి దూరం చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ గవిడి నాగరాజు, ఈవో బండ్లమూడి శ్రీనివాస్, సిబ్బంది గవిడి కనకేశ్వరి పాల్గొన్నారు.



పైడిమాంబ ఆలయం వద్ద యోగాసనాలు

● విజయనగరం రూరల్/దాసన్నపేట: నగరంలోని మన్నార్ రాజగోపాలస్వామి ఆలయ అవరణలో సోమవారం ఉదయం వయోవృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధి బలివాడ వెంకటరమణ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాపై ప్రత్యేక దృష్టి సారించాయన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేసి మానసిక ఉల్లాసాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే.. నగరంలోని మూడు లాంతర్ల వద్ద పైడిమాంబ దేవస్థానం ఆలయం ఆవరణలో సోమవారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ ఏడుకొండలు, ఆలయ అర్చకుడు బంటుపల్లి వెంకటరావుతో పాటు, ఇతర అర్చకులు, సిబ్బంది యోగాసానాలు వేశారు. అనంతరం పైడిమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● శృంగవరపుకోట: శృంగవరపుకోట పుణ్యగిరి రోడ్డులోని ధారగంగమ్మ ఆలయంలో సోమవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు, సిబ్బంది, భక్తులు యోగాసనాలు వేశారు.

● గుర్ల: నిత్యం కొంత సమయం యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని బీజేపీ నాయకుడు కొండపల్లి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మండలంలోని పాలవలస జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి యోగాపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. బీజేపీ మండల అధ్యక్షుడు పోలిపల్లి కనకరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో వారు మొక్కలు పెత్తఎత్తున నాటారు.

చంద్రబాబుకు రుణపడి ఉంటాం



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, జూన్16 (ఆంధ్రజ్యోతి): అంతుచిక్కని వ్యాధితో నరాలు చచ్చుబడి మంచానికే పరిమితమైన స్థానిక నెయ్యిలవీధికి చెందిన గడే దిలీప్‌కు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.లక్ష మంజూరైంది. స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును సోమవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి లబ్ధిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడి కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమను సీఎం చంద్రబాబు ఆదుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటామని దిలీప్ తల్లిదండ్రులు కన్నీటి పర్యాంతమయ్యారు. అలాగే కొత్తవలస మండలం కాటకాపల్లి గ్రామానికి చెందిన బర్ల లక్ష్మికి రూ.1.03 లక్షలు, మరో 32 మందికి రూ.24.19 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు మల్లు నాయుడు, జి.ఎస్.నాయుడు, చంద్రశేఖర్, కోళ్ల శ్రీను, పంచదార్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చిట్టిబాబుకు సత్కారం



చిట్టిబాబును సత్కరిస్తున్న ప్రతినిధులు

విజయనగరం క్రైం, జూన్16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ అవార్డు గ్రహీత పెంకి చిట్టిబాబును సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రవిబాబు మాట్లాడారు. నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఇండియా ఇచ్చే ప్రతిష్ఠాత్మకమైన భారతరత్న సి.సుబ్రహ్మణ్యం జాతీయ అవార్డును విజయనగరం బార్ అసోసియేషన్ సభ్యుడు పెంకి చిట్టిబాబు అందుకోవడం న్యాయవాదులు అందరికీ గర్వకారణమన్నారు. బాధితులు, సాక్షుల పక్షాన నిలబడి పేదలకు ఆయనచేసిన నిర్విరామ కృషికి ఈ అవార్డు అద్దం పడుతోందన్నారు. సీనియర్ న్యాయవాది బెల్లాన రవికుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ గేదెల సత్యం, అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.సురేష్, పి.శివప్రసాద్, న్యాయవాదులు సురేష్, దామోదర రామ్మోహన్, సంతోష్, శంకరరావు పాల్గొన్నారు.

రెజిమెంట్ యాత్ర జయప్రదం చేయండి



మాట్లాడుతున్న నిర్వహణ కమిటీ ప్రతినిధి

విజయనగరం రూరల్, జూన్16 (ఆంధ్రజ్యోతి): యాదవ్ రెజిమెంట్ సాధన కోసం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ తలపెట్టిన యాదవ్ రెజిమెంట్ యాత్ర జూలై 1న ఇచ్ఛాపురం నుంచి విజయనగరం చేరుకుంటుందని యాత్ర నిర్వహణ కమిటీ ప్రతినిధి పల్లా రాజేశ్వరరావు తెలిపారు. సోమవారం రాధాకృష్ణ యాదవ కళ్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాత్ర లక్ష్యాలను వివరించారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో యాత్ర పూర్తయిందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల యాదవ సంఘాలు, యాదవుల్లో ఇప్పటికే ఈ విషయంలో చైతన్యం నింపామన్నారు. సమావేశంలో యాదవ సంక్షేమ సంఘం జిల్లా ప్రతినిధి డాక్టర్ మురపాల బాలాజీ, యాదవ సంక్షేమ సంఘం నాయకులు ముచ్చి రామలింగస్వామి యాదవ్, గడుల సత్యలత, ముద్దాడ మధు, గువ్వల తిరుపతిరావు, బమ్మిడి రమణ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యంతో చర్చించండి

కొత్తవలస, జూన్16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిందాల్‌నగర్‌లో జేఎస్ఎల్ కర్మాగారం లాకౌట్ సమస్య పరిష్కారానికి యాజమాన్యంతో చర్చించాలని కర్మాగార కార్మిక సంఘ గౌరవ అధ్యక్షుడు నెక్కల నాయుడుబాబును కార్మికులు కోరారు. సోమవారం సాయంత్రం ఆయన్ని కార్మికులు కలిశారు. పలుమార్లు లాకౌట్ విధించడం వల్ల ఇబ్బంది పడుతున్నామని వివరించారు. చాలా మంది కార్మికులు ఇప్పటికే పదవీ విరమణకు దగ్గరలో ఉన్నారని, మరికొందరు పూర్తిస్థాయిలో సెటిల్‌మెంట్ చేసుకోవాలని భావిస్తున్నారన్నారు. ఈ సమస్యను యాజమాన్యంతో చర్చించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. ముందుగా తాను యాజమాన్యంతో మాట్లాడి యాజమాన్యం అభిప్రాయం తీసుకున్న తరువాత చర్చలు ఏర్పాటు చేస్తానన్నారు.

జేవీవీలో భాగస్వాములుకండి

రాజాం రూరల్, జూన్16 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జన విజ్ఞాన వేదికలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని జిల్లా గౌరవ అధ్యక్షులు జరజాన నీలయ్య పిలుపునిచ్చారు. రాజాం డివిజన్ కార్యదర్శి గొర్లె రమేష్ అధ్యక్షతన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం జేవీవీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో సభ్యత్వ నమోదు, జిల్లా, రాష్ట్ర మహాసభల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా జేవీవీ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు శాసపు సత్యనారాయణ, గౌరీశ్వరరావు, వేణుగోపాల్ తదితరులున్నారు.

నేలబావిలో పడి వృద్ధుడి మృతి

రాజాం రూరల్, జూన్16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలగవీధి శ్మశానం సమీపంలోని నేలబావిలో పడి గొల్లవీధికి చెందిన బొబ్బిలి లక్ష్మణ (69) మృతి చెం దినట్టు ఏఎస్ఐ రమణ తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మణ మతిస్థిమితం లేకపోవడంతో తరచూ ఇంటి నుంచి వెళ్లి తిరిగి వస్తుంటాడు. ఎప్పటి మాదిరిగానే లక్ష్మణ ఈనెల 15న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దాంతో కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు. చివరకు తెలగవీధిలోని నేలబావిలో పడి మృతి చెందినట్టు కుటుంబసభ్యులు గుర్తించారు. మృతుడి భార్య నారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు.

మోసగించాడని యువతి ఫిర్యాదు

● యువకుడి అరెస్టు

శ్రీకాకుళం రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం పీవీ రాజుపేట గ్రామానికి చెందిన రౌతు వెంకటేశ్ నమ్మించి మోసగించాడని ఓ యువతి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి అరెస్టు చేశామని శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ కె.రాము తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. రాగోలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషి యన్‌గా వెంకటేశ్ పనిచేస్తున్నాడు. ఇదే ఆసుపత్రిలో విజయనగరం జిల్లా రేగిడి ఆమదావలస మండలానికి చెందిన ఓ యువతి పనిచేస్తోంది. వారిద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకోవాలని ఆ యువతి ఒత్తిడి చేయడంతో వెంకటేశ్ తప్పించుకుని తిరుగుతున్నాడు. దాంతో మోసపోయానని గుర్తించిన ఆ యువతి పోలీసులను ఆశ్రయించింది. తొలుత రేగిడి ఆమదాలవలస పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి శ్రీకాకుళం రూరల్ స్టేషన్‌కు పంపించారు. వెంకటేశ్‌పై అట్రాసిటీతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

గంజాయి సేవిస్తున్న నలుగురి అరెస్టు

శృంగవరపుకోట, జూన్16 (ఆంధ్రజ్యోతి): గంజాయిని సేవిస్తున్న నలుగురు వ్యక్తులను సోమవారం శృంగవరపుకోట పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నారాయణమూర్తి తెలిపిన వివరాల మేరకు.. శృంగవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనక పుణ్యగిరి కొండకు అనుకుని ఉన్న తుప్పల్లో వెంకట సత్యనిఖిల్, గణేష్, కలిగోట్ల గ్రామానికి చెందిన పూర్ణకుమార్, అనంతగిరి మండలానికి చెందిన కన్నయ్య గంజాయి సేవిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు చేసి వారిని అరెస్టు చేశారు. వారి నుంచి 50 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

కొట్లాటలో ముగ్గురికి గాయాలు

● ఆరుగురిపై అట్రాసిటీ కేసు నమోదు

జియ్యమ్మవలస, జూన్16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురకనాయుడు వలస గ్రామంలో ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య కొట్లాట జరిగింది. ఈ ఘటనపై చినమేరంగి సీఐ టీవీ తిరుపతిరావు, జియ్యమ్మవలస ఎస్ఐ ఎన్.ప్రశాంత్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. తురకనాయుడువలస గ్రామానికి చెందిన ఎత్తుల శ్రీను కుమార్తె యామిని మెచ్యూరిటీ ఫంక్షన్ ఆదివారం జరిగింది. ఈ ఫంక్షన్‌కు వచ్చిన ఎత్తుల హరి, మరికొందరు సాయంత్రం ఇంటి ముందు ఓపెన్ టాప్ వాహనం ఉంచి అందులో తెచ్చిన సామాన్లను ఎక్కిస్తున్నారు. ఇంతలో వారి వీధి దాటి వెళ్లాల్సిన గొర్లి రాజు, గొర్లి చందు.. స్కూటీపై వచ్చి వాహనాన్ని తీయాలని గొడవపడ్డారు. కులం పేరుతో దూషించి, దాడికి దిగారు. ఇంతలో అక్కడకు చేరుకున్న మరి కొంతమంది దళితులపై అప్పటికే అక్కడికి చేరుకున్న గొర్లి రాజు బంధువులు దాడికి దిగారు. దీంతో ఈతల హరి, దుప్పాడ హరికృష్ణ, పోతుల శివుడుకు గాయాలయ్యాయి. దాంతో చినమేరంగి సీహెచ్‌సీలో చేరారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గొర్లి రాజు, గొర్లి చందు, గొర్లి మురళీ, గొర్లి లక్ష్మి, గొర్లి మజ్జి, గొర్లి పాపారావులపై అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు. ● బాధితులు ఇచ్చిన ఫిర్యాదులో కులం పేరున దూషించారని పేర్కొనడం తో పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు సోమవారం విచారణ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకుంటామని బాధితులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట చినమేరంగి ఎస్ఐ జి.అనీష్ ఉన్నారు.


ఇళ్ల పట్టాలు ఇచ్చేవరకూ పోరాడుతాం



నిరసన తెలియజేస్తున్న దృశ్యం

విజయనగరం దాసన్నపేట, జూన్16 (ఆంధ్రజ్యోతి): నగర శివార్లలోని ధర్మపురిలో సర్వే నెంబరు 86/1, 2, 3లోని 3.77 ఎకరాల్లోని ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేవరకూ పోరాడుతామని పట్టణ బడుగు, బలహీన వర్గాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రెడ్డి నారాయణరావు అన్నారు. సోమవారం ధర్మపురి నుంచి తహసీల్దారు కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్, నగరపాలక సంస్థ పరిధిలోని ధర్మపురి 30 వార్డులో గతంలో డి-పట్టాలను కొంత మందికి ఇచ్చారన్నారు. 2007లో రాష్ట్ర ప్రభుత్వం గయాళ్‌గా వున్న ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేయడంతో అప్పటి నుంచి అమ్మకాలు, కొనుగోళ్లకు అవకాశం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా 22-ఏ లోని ప్రభుత్వ భూమిని ఇళ్ల స్థలాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీటీ రామారావును కలిసి అభినందించారు.

'ఉపాధి' బకాయిలు చెల్లించండి



వినతిపత్రాన్ని అందజేస్తున్న సంఘ నాయకులు

గజపతినగరం, జూన్16 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పురిటిపెంట గ్రామ సచివాలయంలో అధికారులకు ఆయన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి వేతనదారులకు 8 వారాలుగా పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలన్నారు. మేట్లకు ప్రోత్సాకాలు, వేసవి అలవెన్స్‌లు అమలు చేయాలన్నారు. పనులు జరిగేచోట మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు దాసరి సింహాద్రి, తుంపిల్లి అప్పలనాయుడు, చిన్నమ్మ, సత్య తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

విజయనగరం కలెక్టరేట్, జూన్16 (ఆంధ్రజ్యోతి): భూసేకరణ అనంతరం ఐదేళ్ల లోపు కంపెనీ ఏర్పాటు చేయకపోతే ఆ భూములు చట్ట ప్రకారం రైతులకు చెందుతాయని జిందాల్ భూ నిర్వాసితులు అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎస్.కోట మండలంలో పలు గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిందాల్ యాజమాన్యం 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఆ భూములపై యాజమాన్యం హక్కు కోల్పోయిందన్నారు. ప్రస్తుతం ఆ భూముల్లో దౌర్జన్యంగా ఎక్స్‌కవేటర్లు పెట్టి పనులు చేయస్తున్నారన్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని బొడ్డవర, కిల్తంపాలెం, ముషిడిపల్లి, పెదఖండేపల్లి పంచాయతీల్లో జిందాల్ నిర్వాసితులు కె.సత్యనారాయణ, శ్రీరాములు, సన్యాసిరావు, యల్లా రమణ, ఒంటి అప్పారావు, సోమేశ్వరరావు కోరారు.

విత్తనశుద్ధిపై నిర్లక్ష్యం వద్దు

జామి, జూన్16 (ఆంధ్రజ్యోతి): రైతులు విత్తనాలు చల్లే ముందు విత్తన శుద్ధి, మొలక శాతం కట్టడంపై నిర్లక్ష్యం వహించవద్దని మండల వ్యవసాయాదికారి పూర్ణిమ సూచించారు. సోమవారం జామిలో ఆమె రైతులతో సమావేశం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పొందేందుకు రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. డీలర్లు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందు అందించాలని ఆదేశించారు. వ్యాపారులు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పథకాలు అమలు చేయండి

● అంగన్‌వాడీల ఆందోళన



రేగిడి: తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

రేగిడి, జూన్16 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలకు చంద్రబాబు సర్కారు కోత విధించడంపై అంగన్‌వాడీలు ఆందోళన వ్యక్తం చేశారు. మొన్న వంట గ్యాస్ రాయితీ ఎత్తివేత, తాజాగా తల్లికి వందనం వర్తింపజేయకపోవడంపై వారు సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూని యన్ నేతలు మాట్లాడుతూ ఇప్పటికే జీతాలు చాలడంలేదని పోరాడుతున్నామన్నారు. ఇలాంటి సమయంలో సంక్షేమ పథకాలను దూరం చేయటం సరి కాదన్నారు. అనంతరం తహసీల్దారు కృష్ణలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు డి.సుజాత, నిర్మల, ప్రమీల లక్ష్మి, శైలజ, దమయంతి, అనురాధ పాల్గొన్నారు.

● చీపురుపల్లి: సంక్షేమ పథకాలను అమలు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అంగన్‌వాడీల సంఘం ఆధ్వర్యంలో చీపురుపల్లి డీటీ సూర్యకాంతంనకు సోమవారం వినతిపత్రం అందజేశారు. తమ సమస్యను పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షురాలు కె.నాగమణి, సెక్టార్ ప్రతినిధులు లత, కృష్ణవేణి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● గరివిడి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు తమకు కూడా వర్తింపజేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు కోరారు. సోమవారం గరివిడి డీటీకి వినతి పత్రం అందజేశారు.

● రాజాం రూరల్: సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఎదుట వారు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు పి.ఉమ, అధ్యక్ష, కార్యదర్శులు ఉమాకుమారి, పుణ్యవతి పాల్గొన్నారు.

● విజయనగరం కలెక్టరేట్: సంక్షేమ పథకాలు అమలు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘ నాయకులు పైడిరాజు, వి.లక్ష్మి, ప్రభావతి, సునీత తదితరులు పాల్గొన్నారు.

● కొత్తవలస: తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకుడు గాడి అప్పారావు ఆధ్వర్యంలో వియ్యంపేట ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీలు ఆందోళన చేశారు.

● వేపాడ: సంక్షేమ పథకాలను అమలు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు చల్లా జగన్ తదితరులు పాల్గొన్నారు.

● శృంగవరపుకోట: అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. సోమవారం శృంగవరపుకోట తహసీల్దార్ డి.శ్రీనివాసరావుకు సంఘం మండల ప్రతినిధులు డి.శ్యామలకుమారి, వి.మాణిక్యం, డి.సుశీల, జయలక్ష్మి వినతిపత్రం అందజేశారు.

నీళ్లు రావట్లే.. దాహం తీరట్లే!

(3వ పేజీ తరువాయి)

తాగునీటిని అందించాల్సి ఉంది. కానీ అందులో సగం కూడా అందించడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. జనాభాతో పాటు నీటి వినియోగం పెరుగుతుందన్న వాస్తవాన్ని ఇంజనీరింగ్ అధికారులు గుర్తించడం లేదు. సరైన అంచనాలతో పాటు పటిష్ట చర్యలు చేపట్టకపోవడంతో పట్టణవాసులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు.

ప్రణాళికలు లేక...పైప్‌లైన్ లీకులతో ...

వేసవిలో నీటి ఎద్దడితో పాటు పైప్‌లైన్లు, ప్రధాన, బూస్టర్ పంప్ హౌస్, నాగావళి నదిలోని ఇన్‌ఫిల్టర్ బావుల్లో నీటిని తోడే మోటర్ల నిర్వహణ, మరమ్మతులకు రూ.20 లక్షల నుంచి రూ.25 ఖర్చు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. అయితే ఆచరణలో మాత్రం చేతులెత్తేస్తున్నారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఎక్కడ లోపాలు ఉన్నాయన్నది పరిశీలించడం లేదు. ఏం చేస్తే పట్టణ ప్రజలందరికీ పూర్తిస్థాయిలో తాగునీటిని సరఫరా చేయగలమనే దానిపై ముందస్తుగా ప్రణాళికలు రూపొందించడం లేదు. మరోవైపు పైప్‌లైన్ లీకుల సమస్య వేధిస్తున్నా.. శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టడం లేదు. ప్రస్తుతం తాగునీటి సరఫరా కార్మికులు సమ్మెలో ఉన్నారు. ఇప్పటికే ఐదు రోజులకొకసారి పట్టణంలో తాగునీటి సరఫరా జరుగుతోంది. ఆయా వీధుల మహిళలు ఖాళీ బిందెలతో మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. మరోవైపు ప్రధాన, బూస్టర్ పంప్‌హౌస్‌ల వద్ద తాత్కాలిక కార్మికులను నియమించారు. అయితే భవిష్యత్‌లో తాగునీటి సరఫరా సమస్యలు మరింత జటిలమయ్యే అవకాశం ఉందనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు త్వరితగతిన స్పందించి సమ్మెలో ఉన్న కార్మికులతో చర్చలు జరిపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకుంటే ప్రజాగ్రహానికి గురి కాకతప్పదు.

సమ్మెను విరమింపజేయాలి..

ఇప్పటికే ఐదు రోజులకొకసారి పట్టణంలో తాగునీటి సరఫరా జరుగుతోంది. మరోవైపు కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. పాలకులు, అధికారులు స్పందించి సమ్మెను విరమించేలా చర్యలు తీసుకోకపోతే ప్రజాగ్రహాన్ని చూడక తప్పదు. తాగునీటి సరఫరాపై తక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది.

- ఎస్.ఉమా, కొత్తవీధి, పార్వతీపురం

మాకు న్యాయం చేయాలి

తాగునీటి సరఫరా విభాగంలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నాం. పాలకులు, అధికారులు మాపై అశ్రద్ధ చూపడం వల్లే సమ్మెకు దిగాం. సమాన పనికి వేతనం చెల్లించాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం స్పందించి మాకు న్యాయం చేయాలి.

- బాలు, మున్సిపల్ తాగునీటి సరఫరా కార్మికుడు

పక్కా ప్రణాళికలు సిద్ధం చేశాం..

పట్టణంలోని 30 వార్డులకు తాగునీటిని సరఫరా చేసేందుకు పక్కా ప్రణాళికలను సిద్ధం చేశాం. సమ్మె కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణను రూపొందించాం. ఇప్పటికే తోటపల్లి పరిధిలోని నాగావళి నదిలో నీటిని ఇన్‌ఫిల్టర్ బావులకు మళ్లించాం. సమ్మె విరమించాలని తాగునీటి సరఫరా కార్మికులను కోరుతున్నాం.

- శ్రీనివాసరాజు, డీఈ, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం

ఊపిరి తీసిన గుంత

(3వ పేజీ తరువాయి)

విగతజీవులుగా మారడం చూసి గుండెలవిసేలా రోదించారు. మరోవైపు హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు మొండెంఖల్ ఆసుపత్రికి చేరుకున్నారు. బాలికల మృతదేహాలను చూసి తోటి విద్యార్థులు కన్నీటిపర్యంతమయ్యారు. కాగా రామదాస్, మేరీలకు జెస్సిక ప్రథమ సంతానం. అదే గ్రామానికి చెందిన నవీన్, సుభాషిణిలకు సునంద మూడో సంతానం. పోడు వ్యవసాయం చేసుకుని వారు జీవనం సాగిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు నీలకంఠాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి సీహెచ్‌సీకి తరలించారు.

యోగాంధ్ర ఏర్పాట్ల పరిశీలన

(3వ పేజీ తరువాయి)

మున్సిపల్ కార్యాలయంలో జిల్లా అధికారులతో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 30 వరకు డీఏ జుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దీనిలో భాగంగా గిరిజనుల అవసరాలను గుర్తించాలన్నారు. వారికి అవసరమైన ధ్రువపత్రాలు జారీ చేయాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో సేవలు, మౌలిక సదుపాయాలు కల్పనే ధ్యేయంగా పనిచేయాలన్నారు. గ్రామ, క్లస్టర్ స్థాయి శిబిరాల ద్వారా ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందించాలని సూచించారు. ఆధార్, రేషన్, ఆయుష్మాన్ భారత్ కార్డు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, దివ్యాంగ, సామాజిక పింఛన్లు, విశ్వకర్మ, ముద్ర రుణాలు, పీవీటీజీ గృహాల కోసం గిరిజనులు దరఖాస్తులు చేసుకున్నట్లు వెల్లడించారు.

యోగాతోనే ఆరోగ్యం



పార్వతీపురంటౌన్: ర్యాలీ చేస్తున్న దృశ్యం

పార్వతీపురం టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): యోగాతోనే ఆరోగ్యంగా జీవించవచ్చునని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.రామారావు అన్నారు. సోమవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక కళాశా ల నుంచి చర్చి వీధి కూడలి వరకు ఆయన విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు పాల్గొన్నారు. ● పాలకొండ: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు అన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 2, వ్యాయామ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. పీడీ ఎస్.సీతారాం పర్యవేక్షించారు.

అక్రమ సస్పెన్షన్లు ఆపాలి



ఆర్టీసీ డిపో వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్లు, అక్రమ బదిలీలు ఆపాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.శంకరరావు డిమాండ్ చేశారు. ఏపీపీటీడీలో అధికారుల నిరంకుశ వైఖరి పట్ల పాలకొండ డిపో వద్ద సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని, మాట్లాడారు. జిల్లాలో ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్లు, అక్రమ బదిలీలు పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. గ్యారేజ్‌లో స్పేర్ పార్ట్స్ లేక బస్సులు ఎక్కడి పడితే అక్కడ ఆగిపోతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్నారు. సమస్యలు పరిష్కారం రాకపోతే ఈనెల 25వ తేదీ తర్వాత ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పీఎల్ రావు, సీసీఎస్ డెటికేట్ ఎం.వైకుంఠం, ఎంఆర్ మూర్తి, బీవీ రమణ, నీలయ్య, చలం, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుణుపూర్‌లో గ్రీవెన్స్

ఒడిశా

రాయగడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాయగడ జిల్లా గుణుపూర్ సబ్ డివిజన్‌లో కలెక్టర్ పారుల్ పట్వారి అధ్యక్షతన సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. మొత్తం 28 మంది ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలించిన కలెక్టర్.. ఐదుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.3,500 చొప్పున అందజేశారు. మిగతా వాటిని పరిష్కరించవలసిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, జడ్పీ ముఖ్య కార్యనిర్వాహణాధికారి అక్షయ్‌కుమార్ ఖెముండు, జిల్లా కేంద్రాసుపత్రి ముఖ్యవైద్యాధికారి ప్రఫుల్లకుమార్ పాఢి, గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్‌దీప్ కౌర్ పాల్గొన్నారు.

నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలి

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

● సాలూరు మున్సిపల్ కార్యాలయంలో పీజీఆర్ఎస్





సాలూరు: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, పార్వతీపురం: అర్జీదారుల సమస్యలు వింటున్న డీఆర్వో హేమలత

సాలూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌కు వచ్చే వినతులకు నాణ్యమైన పరిష్కారం అందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. సాలూరు మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమంలో డ్వామా పీవో కె.రామచంద్రరావుతో కలిసి ఆయన వినతులు స్వీకరించారు. వేగం, నాణ్యత, నిష్పక్షపాతంగా సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. మొత్తం 154 వినతులు వచ్చాయని తెలిపారు. రామా కాలనీలో నివాసం ఉంటున్న చిక్కాల జ్యోతి తన పేరు మీద లేని కరెంటు మీటర్ రీడింగ్ వల్ల తల్లికి వందనం పథకంలో తన పేరు లేదని, సమస్య పరిష్కరించాలని కోరారు. పట్టణంలో బంగారమ్మ కాలనీలో ఉన్న స్నాక్స్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే పొగ వల్ల అనారోగ్యం బారిన పడుతున్నామని పలువురు వినతిప త్రం అందజేశారు. మావుడి-కందులపథం గ్రామానికి బీటీ రోడ్డు వేయాలని అక్కేన తిరుపతిరావు కోరారు. ఐసీడీఎస్ పీడీ డా.టి.కనకదుర్గ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాబర్ట్‌పాల్, డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు, జిల్లా పరిశ్రమల అధికారి కె.కరుణాకర్, మున్సిపల్ కమిషనర్ జయరాం పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 118 వినతులు

పార్వతీపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో అందిన వినతులకు తక్షణమే పరిష్కారం చూపాలని డీఆర్వో కె.హేమలత అధికారులను ఆదేశించారు. పార్వతీపురం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆమె పాల్గొని, వినతులు స్వీకరించారు. మొత్తం 118 వినతులు వచ్చినట్టు తెలిపారు. భామిని మండలం నల్లరాయిగూడలో 5వ తరగతి వరకు చదివే విద్యార్థులు 150 మంది ఉన్నారని, కానీ పాఠశాలలో ఉపాధ్యాయులు లేనందున వారంతా చదువుకు దూరం అవుతున్నారని గ్రామస్థులు వినతిని అందించారు. కురుపాం పంచాయతీలోని సీతంపేట, పరికివలస, పాత కురుపాం, కాటందొరవలస, కస్పా గదబవలస గ్రామాలకు నెలసరి రేషన్ సరుకులు తెచ్చుకునేందుకు నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి వస్తుందని, సీతంపేటలో కొత్త రేషన్ డిపోకు అనుమతి ఇవ్వాలని ఆ గ్రామస్థులు వినతిని అందించారు. ఇలా వివిధ వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికార ప్రతినిధులు పాల్గొన్నారు.



బెలగాం: ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ అంకిత సురాన



సీతంపేట రూరల్: గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఏవో సునీల్

ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు 60..

సీతంపేట రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో ఏవో సునీల్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు సమస్యలు పరిష్కారం కోరుతూ 60 వినతులు వచ్చాయి. సీతంపేట ఏపీఆర్‌జేసీ పాఠశాలలో అటెండర్ పోస్టు ఇప్పించాలని కోసిమానుగూడ గ్రామానికి చెందిన ఆరిక బాలకృష్ణ కోరారు. బ్యాంక్ కోచింగ్ తీసుకునేందుకు ఆర్థిక సహాయం అందించాలని కూరంగి శ్యామల కోరగా పెద్దతంకిడి గ్రామంలో రచ్చబండ నిర్మించాలని బిడ్డిక రమేష్‌లు ఏవోను కోరారు. ఇలా అనేక సమస్యలు పరిష్కారం కోరుతూ వినతులు వచ్చాయి. ఏవో సునీల్‌తో పాటు టీడబ్ల్యూ డీఈ సింహాచలం, ఏఎంవో కోటిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదనరావు పాల్గొన్నారు.

గడువు లోపు సమస్యలు పరిష్కరించాలి: ఏఎస్పీ

బెలగాం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన సమయంలో సమస్యలు పరిష్కరించాలని ఏఎస్పీ అంకితా సురాన ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్పీ ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. మొత్తం 24 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. త్వరితగతిన ఫిర్యాదులు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ ఆదాం, సిబ్బంది పాల్గొన్నారు.

కాలువ పనులు సక్రమంగా నిర్వహించాలి

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి



కాలువ పనులు పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్

కురుపాం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కాలువ పనులు సక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అధికారులకు ఆదేశించారు. కురుపాంలో రోడ్డు, కాలువ పనులు సక్రమంగా చేపట్టని కారణంగా ఇటీవల స్థానికంగా ఉన్న త్రినాథస్వామి దేవాలయంలోకి మురుగునీరు చేరింది. దీనిపై స్పందించిన ఆమె సోమవారం ఆ స్థలాన్ని పరిశీలించారు. ఈ కాలువ పనులను సక్రమంగా చేపట్టాలని ఆర్‌అండ్‌బీ జేఈ సుశీలను ఆదేశించారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి కాలువ పనులు చేపట్టాన్నారు. అలాగే రోడ్డు పనుల వల్ల తాగునీటి కొళాయిలు రాక ఇబ్బందులు పడుతున్నామని పలువురు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వేణుగోపాల్, పంచాయతీ ఈవో సురేష్, ఎస్ఐ నారాయణరావు, తెలుగు యువత అధికారి ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌కు పరామర్శ

గుమ్మలక్ష్మీపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కురుపాం ఏఎంసీ చైర్‌పర్సన్ కద్రక కళావతి గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సోమవారం పరామర్శించారు. కళావతి స్వగ్రామమైన లక్కగూడకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పాలూరు శ్రీనివాసరావు, లక్కగూడ బూత్ ఇన్‌చార్జి రాజేష్ ఉన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలు చేరుకుంటాం

పాలకొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకుంటామని పాలకొండ హౌసింగ్ ఏఈ యు.సుధారాణి అన్నారు. పాలకొండలోని తన కార్యాలయంలో సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలం, రూరల్‌లో అన్ని స్కీమ్‌లలో కలిపి 783 ఇళ్లకు 248 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన 535 ఇళ్లలో 12 పునాది ముందు దశలోనూ, 70 పునాది, లింటిల్ దశలోనూ, 12 రూఫ్ లెవెల్‌లోనూ, 24 శ్లాబు దశల్లోనూ ఉన్నాయని, ఇంకా నిర్మాణం ప్రారంభించినవి 417 ఉన్నాయని ఆమె వివరించారు. అర్బన్‌లో అన్ని స్కీమ్‌ల్లో కలిపి 2405 ఇళ్లకు 1396 ఇళ్లు పూర్తి అయ్యాయని, మిగిలినవి 1009 ఇళ్ల 68 పునాది ముందు దశల్లోనూ 669 పునాది, లింటల్ దశలోనూ 93 రూఫ్ లెవెల్‌లోనూ 64 శ్లాబ్ దశల్లో ఉన్నాయని, ఇంకా నిర్మాణం ప్రారంభించినవి 115 ఉన్నాయన్నారు. రూరల్, అర్బన్‌లో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు పూర్తి అవ్వడానికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. లబ్ధిదారులకు మెటీరియల్, సిమెంట్ అందుబాటులో ఉందని, గృహ నిర్మాణాలు చేపట్టినవారికి అవి అందిస్తామన్నారు.

పీఎం జుగా సర్వేతో సమస్యల పరిష్కారం

సీతంపేట రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పీఎం జుగా సర్వేలో భాగంగా గుర్తించిన సమస్యలను పరిష్కరిస్తామని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు తెలిపారు. చాకలిగూడ పంచాయతీ గజిలి గ్రామంలో సోమవారం పీఎం జుగా గ్రామసభను నిర్వహించారు. ఈ సభను ఉద్దేశించి ఏపీవో మాట్లాడుతూ పీఎం జుగా ద్వారా గిరిజనులకు అందే సేవలపై వారికి అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటివరకు ఆధార్, రేషన్, హెల్త్‌కార్డులు, బర్త్ సర్టిఫికేట్లు, గ్యాస్, బ్యాంక్ ఖాతాలు లేని వారికి పీఎం జుగా సర్వే ద్వారా ఆయా శాఖల వద్ద వీటిని పొందవొచ్చునని అన్నారు. ఈనెల 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఎంపిక చేసిన 88 గిరిజన గ్రామాల్లో పీఎం జుగా గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. వీటిలో పార్వతీపురం మన్యం జిల్లాలో 54, శ్రీకాకుళం జిల్లాలో 34 గ్రామాలను ఎంపిక చేశారన్నారు. ఈ గ్రామసభలో జడ్పీటీసీ సవర లక్ష్మి, డిప్యూటీ ఈవో గున్న రామ్మోహనరావు, ఎంపీడీవో బీబీ మిశ్రో, ఏపీవో సాగర్, ఏపీఎం కమలకుమారి పాల్గొన్నారు.

నిరసనల హోరు

● కలెక్టరేట్ వద్ద వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన



బెలగాం: నిరసన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

బెలగాం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలు సంఘాల నాయకులు చేపట్టిన ఆందోళనలతో సోమవారం కలెక్టరేట్ హోరెత్తింది. మున్సిపల్ కార్మికులను తల్లికి వందనం పథకానికి అనర్హులుగా గుర్తించి అమలు చేయకపోవడం దారుణమని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మున్సిపల్ కార్మికులకు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ● గుమ్మలక్ష్మీపురం రాయగడ జమ్ము గ్రామానికి చెందిన గిరిజన మహిళలు తమకు రావలసిన స్త్రీనిధి రుణాలు తమకు తెలియకుండా తమ పేరున సీసీ సుమారు రూ.23 లక్షల వరకు అక్రమాలకు పాల్పడ్డారని, సీసీపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ● అంగన్‌వాడీ కార్మికులు తమకు కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. తమ సమస్యల పరిష్కారానికి జూలై 9న దేశ వ్యాప్త సమ్మె చేపట్టనున్న ట్లు తెలిపారు.

తల్లికి వందనం వర్తింపజేయాలి

పాలకొండ: మున్సిపల్, ఇంజనీరింగ్, పారిశుధ్యం, ఎన్ఎంఆర్ కార్మికులకు షరతులు లేకుండా తల్లికి వందనం పథకం వర్తింపజే యాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణా రావు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ రత్నంరాజుకు వినతిపత్రాన్ని అందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మున్సిపల్ కార్మిక సంఘాల యూనియన్ నాయకులు పి.వేణు, సీహెచ్.సంజీవి, విమల, పి.అప్పలకొండ తదితరులు ఉన్నారు.

పంట కాలువలకు మహర్దశ

వీరఘట్టం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటపల్లి ఎడమ కాలువ నుంచి వెలువడే బ్రాంచి కాలువలు పూడికతీత పనులు చురుగ్గా సాగుతున్నాయి. గతంలో నిధులు లేక కాలువలను పూడికలు కూడా తీయకపోవడంతో రైతులకు సాగునీరు అందడం ఇబ్బందిగా మారేది. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ బ్రాంచ్ కాలువలు పూడికల తొలగింపునకు నిధులు మంజూరు అయ్యేలా కృషి చేశారు. సుమారు రూ.50లక్షలు మంజూరు కావడంతో పంట కాలువలకు మహర్దశ పట్టింది. అధికారులు పర్యవేక్షణలో పూర్తిస్థాయిలో కాలువలోని పూడికలను తొలగించినట్టయితే ఈ ఏడాది శివారు భూములకు కూడా సాగునీరు ఇబ్బందులు లేకుండా ఉంటుందని రైతులు అంటున్నారు.

చెరువుల్లా పంట పొలాలు



సాంబన్నవలసలో పొలాల్లో చేరిన వర్షపునీరు

గరుగుబిల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంట పొలాలు చెరువుల్లా దర్శనమిస్తున్నాయి. గత కొద్ది రోజులుగా వర్షాలు కురవడంతో వర్షపునీరు పంట పొలాల్లో అధికంగా చేరింది. సోమవారం కురిసిన వర్షానికి మరింతగా వర్షపు నీరు పొలాల్లో చేరడంతో వరినారు పోయలేని పరిస్థితి నెలకొంది. వర్షాలు కురుస్తున్నా చెరువుల్లో అంతంత మాత్రంగానే నీరు చేరింది. అయితే పంట పొలాల్లో మాత్రం నీరు అధికంగా చేరడంతో రైతులకు కొంతమేర వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడింది.

నగరంలో పారిశుధ్య పరిస్థితి అధ్వానం

● కౌన్సిల్ సమావేశంలో అధికారుల తీరుపై ధ్వజమెత్తిన కౌన్సిలర్లు



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మల్లీశ్వరి

పాలకొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో పారిశుధ్యం పరమ అధ్వానంగా ఉందని, పలు ప్రాంతాల్లో వీధిలైట్లు కూడా లేవని కౌన్సిలర్లు కొరికాన గంగునాయుడు, దుప్పాడ పాపినాయుడు తదితరులు ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆకుల మల్లీశ్వరి అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిలర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలంలో చిన్నపాటి వర్షం పడినా మురుగునీరు కాలువల్లో నిండి ప్రధాన రహదారిపై ప్రవహిస్తోందన్నారు. వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీనిపై చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో ఎటుచూసినా చెత్తా చెదారాలు దర్శనమిస్తున్నాయి.. వాటిని తొలగింపజేయాలని అధికారులకు సూచించారు. వీధిదీపాల నిర్వహణపై ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యను పరిష్కరించాలన్నారు. వార్డు కౌన్సిలర్లందరికీ సమాన ప్రాతిపదికన అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని పదో వార్డు కౌన్సిలర్ భాసూరు కాంతారావు తదతరులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై చైర్‌పర్సన్ స్పందిస్తూ వార్డుల్లోని పరిస్థితులకు అనుగుణంగా నిధులు కేటాయిస్తామని తెలిపారు. అత్యవస పనుల నిమిత్తం టేబుల్ అజెండాను అధికారులు కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై వైసీపీ కౌన్సిలర్లు మన్మథరావు తదితరులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కొన్ని అభివృద్ధి పనులకైనా ఆమోదించాలని చైర్‌పర్సన్ కోరారు. అయినప్పటికీ వైసీపీ కౌన్సిలర్లు ఆమోదించకపోవడంతో చైర్‌పర్సన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కౌన్సిల్ సమావేశం పెట్టేముందు కౌన్సిలర్ల అభిప్రాయాలు తెలుసుకుని అజెండా తయారు చేయాలని వైసీపీ కౌన్సిలర్లు కోరారు. ఈ సమావేశంలో నగర పంచాయతీ కమిషనర్ రత్నంరాజు, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నగర పంచాయతీ స్టాండింగ్ కౌన్సిల్‌గా సంతోష్‌కుమార్

పాలకొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్‌గా రెడ్డి సంతోష్‌కుమార్‌ను నియమిస్తూ నగర పంచాయతీ కమిషనర్ రతన్‌రాజు సోమవారం ఉత్తర్వులు అందించారు. సంతోష్‌కుమార్ ఈ పదవిలో మూడేళ్లు కొనసాగనున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మక్కువ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మక్కువ పంచాయతీ కార్యనిర్వహణాధికారి బెహరా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక నక్కలవీధిలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

సీతానగరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన బదిలీలలో వివిధ మండలాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు సోమవారం స్థానిక ఎమ్మార్సీలో ఎంఈవోలు జి.సూరిదేముడు, ఎం.వెంకటరమణ సమక్షంలో విధుల్లో చేరారు. ఈసందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ మొత్తం మండలంలో 65 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్, ఏపీటీఎఫ్, పీఆర్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు సేఫ్టీ పరికరాల పంపిణీ

గుమ్మలక్ష్మీపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం పంచాయతీలోని గ్రీన్ అంబాసిడర్లకు సోమవారం సేఫ్టీ వస్తువులను పంపిణీ చేశారు. సర్పంచ్ బి.గౌరీశంకరరావు చేతులమీదుగా దుస్తులు, కళ్లద్దాలు, హ్యాండ్ బ్లౌజులు, పరికరాలను అందజేశారు.

మండల వ్యవసాయ అధికారిణిగా జ్యోత్స్న

గరుగుబిల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండల వ్యవసాయాధికారిణిగా టి.జ్యోత్స్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో వ్యవసాయాధికారిణిగా వ్యవహరించిన ఆర్.విజయభారతి జియ్యమ్మవలస మండల ఏవోగా బదిలీ అయ్యారు. ఈమె స్థానంలో జ్యోత్స్న జియ్యమ్మవలస నుంచి ఇక్కడకు వచ్చారు.

గరుగుబిల్లి డీటీగా రాజేంద్ర

గరుగుబిల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల ఉప తహసీల్దార్‌గా మర్రాపు రాజేంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డీటీగా విధులు నిర్వహించిన బి.సుందరరావు పదవీ విరమణ పొందారు. దీంతో ఆయన స్థానంలో పార్వతీపురం పౌర సరఫరాల విభాగంలో డీటీగా చేసిన రాజేంద్ర వచ్చారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

జియ్యమ్మవలస, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో పనిచేస్తున్న రెవెన్యూ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం చూపించొద్దని తహసీల్దార్ వై.జయలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె వీఆర్వోలు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. రెవెన్యూ గ్రామాల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రావడానికి వీల్లేదని అన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరుగుబిల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ మండల అసిస్టెంట్ ఇంజనీర్ బడే శ్రీనివాసనాయుడు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గరుగుబిల్లి మండల కేంద్రంతో పాటు గొట్టివలస, గొల్లవానివలస, రావుపల్లి, కొత్తూరు, తులసిరామినా యుడువలస, బురదవెంకటాపురం, పెద్దూరు, కొత్తపల్లి, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలుపుదల ఉంటుందన్నారు.